www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 23 ఫిబ్రవరి 2024
5
వైఎస్ఆర్



పిల్లల ఆరోగ్యంపై జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి - కడప

పిల్లల విద్య, ఆరోగ్య విషయాల పట్ల అధికారులు తగు జాగ్రత్తలు వహించాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్ ఆదేశించారు. గురువారం కడప నగరం చిన్న చౌక్‌లోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలను సందర్శించారు. అక్కడ న్యాయ సదస్సును నిర్వహించారు. వసతి గదులను, వంటశాలను, టాయిలెట్స్‌ను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారి బాలల సంరక్షణ కొరకు స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం 2015 వివరించారు. పిల్లలు స్వశ్రద్ధతతో విద్యను అభ్యసించాలని అని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎ. మణికుమారి, వార్డెన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైవీయూ హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్

29 మంది విద్యార్థులకు అస్వస్థత
మెరుగైన వైద్యం అందించాలి : విద్యార్థి సంఘాలు



రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

ప్రజాశక్తి-కడప అర్బన్

కడపలోని యోగి వేమన విశ్వ విద్యాలయంలో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. బుధవారం రాత్రి వైవీయూ వసతి గహంలో భోజనం చేసిన తర్వాత విద్యార్థులు వాంతులు, విరోచనాలు చేసుకొని అస్వస్థతకుగురై అపస్మారక స్థితికి చేరుకున్నారు. కలుషిత ఆహారం తినడం వల్లనే అన్వస్థతకు గురయ్యారు. వైవీయూ వసతి గృహంలో ప్రతిరోజు విద్యార్థులు రాత్రి 7.30 గంటల నుంచి 9.30 గంటల వరకు భోజనం చేస్తారు. రాత్రి భోజనంలో అన్నం, వంకాయ కూర, రసం, పెరుగును విద్యార్థులకు వసతి గృహంలో వడ్డించారు. ఎప్పటిలాగే బుధవారం రాత్రి భోజనం చేసిన విద్యార్థులు 10.30 గంటల ప్రాం తంలో అస్వస్థతకు గురయ్యారు. 10 మంది విద్యార్థులు వాంతులు, విరేచనాలు చేసుకొని అస్వస్థతకు గురికాగా వెంటనే వైవీయూ అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించి అత్యవసర విభా గంలో వైద్య సేవలు అందించారు. విద్యార్థులతోపాటే రిమ్స్‌కు వైవీయూ వైస్ చాన్స్‌లర్ ఆచార్య చింతా సుధాకర్, కళాశాల ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి చేరుకొని రాత్రంతా విద్యార్థుల దగ్గరే ఉండిపోయారు. విద్యార్థులు కోలుకోవడంతో గురు వారం ఉదయం 6 గంటల ప్రాంతంలో వైద్యులు డిశ్చార్జి చేశారు. ఈలోగా వైవీయూ వసతి గృహంలో 8 గంటల ప్రాంతంలో మరో 19 మంది విద్యార్థులు వాం తులు, విరేచ నాలు కావడంతో రిమ్స్‌కు తరలించి చికిత్స అంది స్తున్నారు. వారిని కూడా హుటా హుటిన విద్యార్థుల సమాచారాన్ని వైవీయూ అధికా రులువారి తల్లి దండ్రులకు చేర వేశారు. విద్యార్థులు కలుషిత ఆహారం తినడం వల్లే ఫుడ్‌ఫాయిజన్‌కు గురయ్యారు. వైవీయూ వసతి గృహంలో విద్యా ర్థులకు నాసిరక భోజనం వడ్డి స్తున్నారని గతంలో పలు మార్లు విద్యార్థి నంఘాలు ఆందోళన బాట వట్టిన విషయం విధితమే. వారానికి ఒక్కసారి వైవీయూ ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి హాస్టల్‌ను తనిఖీ చేసి భోజన పదార్థాల నాణ్యతను పరిశీంచినట్లు తెలుస్తోంది. అయితే హాస్టల్ వార్డెన్ నిర్లక్ష్యం కారణంగానే ఈ సంఘటన జరిగినట్లు తెలుస్తోంది. వారి పర్యవేక్షణ లేకపోవడం వల్ల హాస్టల్ నిర్వహణ సక్రమంగా సాగడంలేదని తెలుస్తోంది.



అధికారులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మెరుగైన వైద్యం అందించాలి : విద్యార్థి సంఘాలు

వైవీయూలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర యూనివర్శిటీ కో-కన్వీనర్ ఎం.ఆర్.నాయక్, ఆర్‌వీఎస్ రాష్ట్ర కార్యదర్శి మల్లెల జగదీష్ డిమాండ్ చేశారు. గురువారం 500 మంది విద్యార్థులతో యూనివర్శిటీ మెయిన్ గేటు ఎదుట ధర్నా నిర్వ హించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల ప్రాణాలతో చల గాటం ఆడవద్దని డిమాండ్ చేశారు. వెంటనే ఫుడ్ పాయిజన్‌కు గల కారణాలు తెలుసుకోవాలని చెప్పారు. అధికారులు అవినీతి, అక్రమాలకు పాల్ప డుతూ విద్యార్థుల సంక్షేమాన్ని గాలికివదిలేశారని విమర్శించారు. విద్యార్థులకు పెట్టే భోజనంలో నాణ్యత, శుభ్రత లేకపోవడంతో ఈ సమస్య వచ్చిందని పేర్కొన్నారు. విసి, రిజిస్ట్రార్ దృష్టికి తీసు కువెళ్లినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. 'తినడానికి వచ్చారా.. చదువు కోవ డానికి వచ్చారా' అంటూ విద్యార్థులను వార్డెన్లు బెది స్తున్నారని తెలిపారు. యూనివర్శిటీ హెల్త్ సెంట ర్‌లో మహిళా డాక్టర్లు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బ ందులు పడుతున్నారని చెప్పారు. సెమిస్టర్ పరీక్షలు రాయాల్సిన వారు అస్వస్థతకు గురి కావడంతో రాయలేక పోయారని, పరీక్షలు వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ప్రాణాలకు నష్టం వాటిల్లితే యూనివర్శిటీ అధికారులు, ప్రభుత్వం బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో నిరాహార దీక్షలు చేస్తామని పేర్కొన్నారు.

బిజెపి ప్రభుత్వ దమనకాండ నశించాలి

- నిరసనలో రైతు సంఘాల నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్/జమ్మలమడుగు రూరల్

రైతాంగం పట్ల నరేంద్ర మోడీ ప్రభుత్వం నిరంకుశత్వం రైతుల పట్ల కర్కషంగా వివరించిన విధానాన్ని నిరసిస్తూ రైతు సంఘం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం పాత బస్టాండ్ పూలే సర్కిల్ వద్ద నిరసన చేపట్టారు. సిపిఐ, సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ జి.చంద్ర, రైతు సంఘాల జిల్లా కార్యదర్శులు దస్తగిరి రెడ్డి, భాస్కర్, సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఢిల్లీ రైతు ఉద్యమం సందర్భంగా గతంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో బిజెపి ప్రభుత్వం విఫలం చెందిందని చెప్పారు. అందుకు నిరసనగా రెండో విడత ఢిల్లీ రైతాంగం శాంతియుతంగా ఢిల్లీకి పోతుంటే బిజెపి ప్రభుత్వం రైతుల పట్ల కాల్పులు జరిపి, పోలీసులచే దాడి చేయించి రైతు శుభ్ కరణ్ సింగ్ ను కేంద్ర ప్రభుత్వం బలితీసుకుందన్నారు. గత రైతు ఉద్యమ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం రాతపూర్వకంగా రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ముఖ్యంగా రైతులు పండించే అన్ని పంటలకు డాక్టర్.ఎం.ఎస్ .స్వామినాథన్ సిఫార్సుల మేరకు మద్దతు ధరలు ప్రకటించి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. పంటరుణాలను మాఫీ చేసి ఆత్మహత్యల నుంచి రైతాంగాన్ని కాపాడాలని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో పెట్టిన విద్యుత్ బిల్లు 2020ను ఉపసహరించుకోవాలని చెప్పారు. గత రైతు ఉద్యమ సందర్భంగా మరణించిన అమరవీరుల కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని, రైతుఉద్యమంలో రైతునాయకులపై పెట్టిన కేసులను ఎత్తి వేయాలని పేర్కొన్నారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమాన్ని చర్చలు జరిపి రైతాంగం ఆందోళనను విరమించే విధంగా కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతు స్వరాజ్య వేదిక జిల్లా కన్వీనర్ శివారెడ్డి, సిపిఐ, సిపిఎం నగర కార్యదర్శులు వెంకట శివ, రామ్మోహన్, రైతు సంఘాల నాయకులు శేఖర్ రెడ్డి, మనోహర్ రెడ్డి, సావంత్ సుధాకర్, సిఐటియు నగర అధ్యక్షులు చంద్ర రెడ్డి, విద్యార్థి యువజన సంఘాల నాయకులు రాజేంద్ర, ఓబులేష్ పాల్గొన్నారు. **మోడీ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలి..** పంజాబ్ – హర్యానా సరిహద్దులో ఖనౌరి వద్ద శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రైతన్నలపై కాల్పులు జరిపి శశిధరన్ అనే యువ రైతుని చంపిన మోడీ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బి. మనోహర్ అన్నారు. గురువారం స్థానిక జమ్మలమడుగు పట్టణంలోని ఎన్‌జిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంజాబ్ హర్యానా సరిహద్దులలో ఖనౌరి వద్ద శాంతి యుతంగా ఆందోళన చేస్తున్న రైతులపై కాల్పులు దుర్మార్గమని తెలిపారు. అన్నం పెట్టే రైతన్నలను చంపడం చాలా ఘోరమని తెలిపారు. హర్యానా ప్రభుత్వం కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళనలు చేస్తే ఢిల్లీకి రాకుండా ముళ్లకంచెలు, దిమ్మెలు కట్టి, గుంతలు తవ్వి, అడ్డుకోవడం చాలా దారుణమని తెలిపారు. చనిపోయిన రైతు కుటుంబానికి సంతాపం తెలుపుతూ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యకర్తలు సిపిఎం పట్టణ కార్యదర్శి జి. ఎసుదాస్, విజయ్, ఏ. వినయ్ కుమార్ పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న రైతు, ప్రజా సంఘాల నాయకులు



మాట్లాడుతున్న ఆర్‌జెడి రాఘవరెడ్డి

విలువలతో కూడిన బోధన అవసరం : ఆర్‌జెడి

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

విద్యార్థులకు విలు వలతో కూడిన బోధన చేయాలని ఆర్‌జెడి రాఘ వరెడ్డి పేర్కొన్నారు. గురు వారం మండలంలోని భారత్ ఇంజి నీరింగ్ కళా శాలలో మండలస్థాయి క్విజ్ పోటీలు నిర్వహిం చారు. ముఖ్య అతిథు లుగా ఆర్‌జెడితోపాటు ఎస్ఎస్ఎ పిఒ అంబవరపు ప్రభాకర్‌రెడ్డి, డిఇఒ అనురాధ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను పోటీ పరీక్షల ద్వారా వెలికి తీసేందుకు మండల వ్యాప్తంగా ఐదవ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించడం సంతషకరమన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు నైతిక విలువలు పెంపొందించే దిశగా విద్యాబోధన ఉండాలన్నారు. విద్యార్థులు విద్యార్థి దశ నుంచే సేవా గుణం అలవర్చుకొని ఉన్నత స్థానానికి చేరుకోవాలన్నారు. రానున్న కాలంలో ఇలాంటి టాలెంట్ టెస్ట్‌లు మండల స్థాయిలోనే కాకుండా జిల్లా స్థాయిలో మరియు జోనల్ స్థాయిలో నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. విద్యా ర్థులకు తరగతి గదిలో క్లాస్ సెమినార్స్, గ్రూప్ డిస్కషన్స్, ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచాలన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు సంస్కారం, జ్ఞానంతో పాటు ఆధ్యాత్మిక భక్తి భావాలు ఉండాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి వెంకటరామిరెడ్డి, ఎఎస్ఎ ఐఇడి కో-ఆర్డినేటర్ మిట్ట కేశవరెడ్డి, ఎస్‌టియు రాష్ట్ర నాయకులు బాలగంగి రెడ్డి, ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బిషప్ ఐజాక్ వరప్రసాద్‌కు శుభాకాంక్షలు

ప్రజాశక్తి - కడప

నగరంలోని సిఎస్ఐ సెంట్రల్ చర్చిలో సిఎస్ఐ రాయలసీమ అధ్యక్ష మండల పీఠాధిపతులుగా పట్టాభిషేకతులైన బిషప్ ఐజాక్ వరప్రసాద్ మూడవ వార్షికోత్సవ సందర్భంగా గురువారం ఆయన్ను వైసిపి జిల్లా అధ్యక్షులు సురేష్ బాబు మర్యాదపూర్వకంగా కలిసి అభినందన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పెనుబాల విజయ్ కుమార్, సిఎస్ఐ చర్చ్ పాస్టర్ ముత్తయ్య, సెక్రెటరీ మనోహర్ బాబు, ట్రేజరర్స్ డానియల్ , జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర పరిస్థితిని ఎదుర్కోవాలి : ఎఆర్ డిఎస్‌పి

కడప అర్బన్ : అత్యవసర సమయంలో పరిస్థితిని అదుపులో తీసుకొచ్చేలా ప్రతి ఒక పోలీసు నిష్ణాతులు కావాలని ఎఆర్ డిఎస్‌పి మురళీధర్ పేర్కొన్నారు. ఎస్‌పి సిద్దార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు గురువారం ఎఆర్, సివిల్ పోలీసులు స్పెషల్ పార్టీ పోలీసులకు స్థానిక పెరేడ్ గ్రౌండ్‌లో రిఫ్రెషర్ కోర్స్‌లో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఏవైనా సమస్యలు తలెత్తినపుడు సమర్థంగా ఎదుర్కోడానికి ప్రతి ఒక్క పోలీసు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సమస్యలు తలెత్తినపుడు జన సమూహంను నివారించేందుకు ఏ విధమైన సమయస్ఫూర్తిని వ్యవహరించాలనే అంశాలపై పోలీసు సిబ్బందికి శిక్షణ ఇచ్చామని పేర్కొన్నారు. స్టోన్ గాడ్, హెల్మెట్, లాఠీ, టియర్ గ్యాస్ ఆయుధం మొదలైన ఇతర పరికరాలు లాఠీ డ్రిల్, మాబ్ కంట్రోల్, ఏ సమయంలో చేయాలి, సంయమనం ఎలా పాటించాలి, భాష్పవాయువు ప్రయోగాలను ఎలాంటి సందర్భాల్లో అనుసరించాలనే విషయాలపై 'యాంటీ రయట్' డ్రిల్ లో భాగంగా పోలీసులకు మెలకువలను నేర్పిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐలు ఆనంద్, వీరేష్, శివరాముడు, టైటస్, ఆర్ఎస్ఐలు, ఎఆర్ పోలీస్ సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

అబుల్ కలాం ఆజాద్ సేవలు మరువరాదు

కడప అర్బన్ : మొట్టమొదటి విద్యాశాఖ మంత్రి అబుల్ కలాం ఆజాద్ సేవలు మరువలేనివని టిడిపి కడప నియోజకవర్గం మాజీ ఇన్‌ఛార్జి అమీర్ బాబు అన్నారు. గురువారం వారి కార్యాలయంలో ఆజాద్ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిముల పవిత్ర స్థలం మక్కాలో ఆయన జన్మించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ ఆలం ఖాన్ పల్లె లక్ష్మీ రెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు మన్మోహన్ రెడ్డి, పాలకొండ దేవస్థానం మాజీ చైర్మన్ ఓబుల్ రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటేష్, మైనార్టీ నగర అధ్యక్షులు ఇమ్రాన్, 39 వ డివిజన్ సీనియర్ నాయకులు ఇలియాస్, కరిముల్లా పాల్గొన్నారు.

వాలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం : ఎమ్మెల్యే

చెన్నూరు : ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వాలంటీర్ల వ్యవస్థ దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని కమలాపురం శాసనసభ్యులు పి రవీంద్రనాథ్‌రెడ్డి, యువ నాయకులు నరేన్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించిన వాలంటీర్లకు వందనం కార్యక్ర మంలో వారు పాల్గొని మాట్లాడారు. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుక పోవడంలో వాలంటీర్ల పాత్ర ఎంతో గొప్పది అన్నారు. నాయకులను కూడా గుర్తు ఃపట్టలేని కుటుంబాలలో వాలంటరీల పేరు చిరస్థాయిగా నిలిచింద న్నారు. పార్టీలకు అతీతంగా, కుల మతాలను చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపిపి సరేష్ యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి గుమ్మడి ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు

ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - కడప

త్వరలో నిర్వహించబోయే అసెంబ్లీ, పార్లమెంటరీ ఎన్నికలను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.విజయ్ రామరాజు ఎన్నికల నిర్వహణ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ లోని స్పందన హాలులో ఎన్నికల విధుల్లో పాల్గొనే ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు, మాస్టర్ ట్రైనర్లకు.. 'ఎలెక్షన్ ఎక్స్పెండెచర్ మెకానిజం'పై డివిజనల్ కో – ఆపరేటివ్ అధికారి జే.సురేష్ అధ్యక్షతన ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల విధి నిర్వహణలో రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు ప్రతి అంశాన్ని సూక్ష్మ దృష్టితో పరిశీలిస్తూ చిత్తశుద్ధితో, బాధ్యతాయుతంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మాస్టర్ ట్రైనర్లు పోలింగ్ అధికారులకు పూర్తి స్థాయిలో శిక్షణ ఇవ్వాలన్నారు. అనుమానం ఉన్న ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా శిక్షణలో తెలుసుకోవాలన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు "మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్" విధిగా పాటించాలన్నారు. రూట్ మ్యాప్, బ్యాలెట్ ముద్రణ, పోలింగ్ మెటీరియల్ సమకూర్చుకోవడం, మెటీరియల్ డిస్పాచ్ చేయడం, రిసెప్షన్ సెంటర్ల ఏర్పాటు, స్ట్రాంగ్ రూముల ఏర్పాటు, కౌంటింగ్ సమయంలో భద్రతా ఏర్పాట్లకు అవసరమైన చర్యలను పర్యవేక్షించడంతో పాటు సీజర్, సి–విజిల్ విధులను బాధ్యతగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కో–ఆపరేటీవ్ అధికారి సుభాషిణి, జిల్లా ఆడిట్ ఆఫీసర్ మంజులవాణి, ఎక్సటెన్షన్ మానిటరింగ్ నోడల్ ఆఫీసర్ నాగరాజు, పోలింగ్ అధికారులు పాల్గొన్నారు.

25న రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు

కడప : నగరంలోని రవీంద్ర నగర్‌లో ఉన్న యుఎష్ మహా కల్యాణ మండపంలో ఈనెల 25న రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలను నిర్వహించనున్నట్లు బాడీ బిల్డింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు నూనె నగేష్, షేక్ యునుస్ బాషా ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. పోటీల్లో రాష్ట్ర నలుమూలల నుండి 300 మంది బాడీ బిల్డర్స్ వస్తున్నట్లు వారు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి నగదు బహుమతులు రూ. 4.30 లక్షలు అందిస్తామని చెప్పారు. క్రీడాకారులకు అన్ని వసతి, భోజన ఏర్పాట్లను కల్పిస్తామన్నారు. సినీ నటులు రామ్‌జగన్, మరళీ, జబర్దస్త్ నటులు శాంతి కుమార్, జీవన్, హరికృష్ణ ఉపన్యాసాలు, మిమిక్రీ, డాన్స్ షోలు ఉంటాయన్నారు. పోటీల ప్రారంభ, ముగింపు సమావేశాలల్లో ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాషా, మేయర్ సురేష్‌బాబు, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, పులి సునీల్‌కుమార్, కార్పొరేటర్లు హాజరవుతారని తెలిపారు.

షర్మిల ఆధిపత్యాన్ని జీర్ణించుకోలేని ప్రభుత్వం

ప్రజాశక్తి - కడప



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

పిసిసి అధ్యక్షులు వై.ఎస్. షర్మిలరెడ్డి ఆధి పత్యాన్ని వైసిపి ప్రభుత్వం జీర్ణిం చుకోలేకపోతోందని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు వై. విష్ణు ప్రీతంరెడ్డి, రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు మహమ్మద్ అలీ ఖాన్, ఆర్‌టిఐ విభాగం రాష్ట్ర అధ్యక్షులు కోటపాటి లక్ష్మయ్య అన్నారు. షర్మిలా రెడ్డి నేతృత్వంలో విజయ వాడలో డిఎస్‌సి ఉద్యోగాల్లో ప్రభుత్వం చేస్తున్న దగా , అన్యాయాన్ని ప్రశ్నిస్తూ రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నిర్వహించ తలపెట్టిన కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికార బలంతో అణగదొక్కడానికి ప్రయత్నించడం దారుణమని వారు పేర్కొన్నారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. విజయవాడలోని పిసిసి కార్యాలయాన్ని పోలీసుల ద్వారా దిగ్బంధనం చేయడమే కాకుండా, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు అందర్నీ అరెస్టు చేయడం దారుణమన్నారు. నిరుద్యోగులకు జరు గుతున్న అన్యాయం , ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్యాన్ని ప్రశ్నించడానికి చేపట్టిన చలో సచివాలయం కార్యక్రమాన్ని అడ్డుకోవడం జగన్ నియంతృత్వానికి నిదర్శనమని ఆరోపించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్ పాల్గొన్నారు.

'ఉయ్యాలవాడ' త్యాగం స్ఫూర్తిదాయకం

కడప అర్బన్ : ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవితం, పోరాటం, త్యాగం నేటి తరానికి స్ఫూర్తిదాయకం కావాలని పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజనీరు జి.వి. శ్రీనివాసులరెడ్డి పిలుపు నిచ్చారు. గురువారం ప్రెస్ క్లబ్‌లో రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 177 వర్ధంతి నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. శ్రీనివాసులురెడ్డి పాత్రికేయుడు ఫణి రచించిన 'రేనాటి సూర్యుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సభ అధ్యక్షులు, ఇంటాక్ జిల్లా కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి, వైవీయూ పాలక మండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, రాష్ట్ర అధికార భాషా సంఘం సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో ఎపి పాలేగార్స్ వారసుల సంక్షేమ సంఘం నాయకులు బలరామయ్య, చంద్రప్ప నాయుడు, మంగమనాయుడు, లోక్‌సత్తా జిల్లా నాయకులు దేవర శ్రీకృష్ణ, రెడ్డి సేవా సమితి జిల్లా కార్యదర్శి లెక్కల కొండారెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి పద్మప్రియ చంద్రారెడ్డి, రాయలసీమ సాగునీటి సాధన సమితి కన్వీనర్ దేవగుడి చంద్రమౌళీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపు కిసాన్ మేళా

చింతకొమ్మదిన్నె: స్థానిక వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ఈ నెల 24న కిసాన్ మేళా నిర్వహించనున్నట్లు పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాస ఆచారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దక్షిణ మండల సంచాలకులు రమణ తోపాటు వైఎస్ఆర్ జిల్లా ఉద్యాన వన అడ్వైజరీ బోర్డు చైర్మన్ ప్రసాద్ రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొంటారని, రైతు సోదరులందరు పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతాం

ప్రజాశక్తి - కడప



మైక్రో ప్రాసెసింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ సిఎం

కడప నగరాన్ని సుందరంగా తీర్చి దిద్దుతామని ఉప ముఖ్య మంత్రి అంజా ద్‌బాషా, నగర మేయర్ కె.సురేష్ బాబు పేర్కొన్నారు. గురువారం స్థానిక పొట్లంపల్లిలో చెత్తను ఎరువుగా మార్చే మైక్రో ప్రాసెసింగ్ సెంటర్, జిటి ఎస్ సెంటర్‌ను ప్రారంభించారు. ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ కడప నగర అభివృద్ధిలో భాగంగా నగరాన్ని ఐదు జోన్లుగా విభజించి పతి జోన్ కు ఒక జిటిఎస్ సెంటర్ ను ఏర్పాటు చేశామన్నారు. ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ చేసి సెగ్రిగెట్ చేసిన తర్వాత మైక్రో ప్రాసెసింగ్ సెంటర్‌లో చేరుస్తారన్నారు. అనంతరం యూనిట్‌లోని పలు ప్రదేశాలను పరిశీలించి అక్కడి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు షేక్ మొహమ్మద్ షఫీ, అజ్మతుళ్ళ ఖాన్, రామకృష్ణారెడ్డి, పాకా సురేష్, మల్లికార్జున, సుదర్శన్ రెడ్డి, చెన్నయ్య, నాయకులు ఎస్బి అహ్మద్ బాషా, నారపరెడ్డి సుబ్బారెడ్డి, జయచంద్ర రెడ్డి, పెద్దిరెడ్డి రామ్మోహన్ రెడ్డి, అధికారులు అనధికారులు పాల్గొన్నారు. బళ్లారి రోడ్డులోని నవత ట్రాన్స్‌పోర్టు సమీపంలో స్ట్రోమ్ వాటర్ డ్రైన్‌కు ఉప ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. అనేక సంవత్సరాల కల నేటికీ సహకారం అయిందన్నారు. ఈ ప్రాంతవాసులు చిన్నపాటి వర్షం పడిన రోడ్ల మీదకు, ఇళ్లల్లోకి నీరు వచ్చి అనేక ఇబ్బందులు పడేవారని అన్నారు. గతంలో పాలకులు ఏ పనులు చేయక విస్మరించారని చెప్పారు. ఇక నుంచి ఆ సమస్య ఉండదని తెలిపారు.

గ్రూప్-2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

ఈనెల 25న నిర్వహించబోయే గ్రూప్–2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని, పరీక్షలు రాసే అభ్యర్థుల సౌలభ్యం కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని కలెక్టర్ విజయ్‌రామరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల సమాచార సౌలభ్యం కోసం కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ : 08562-246344ను ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 23 నుండి 25 వరకు కంట్రోల్ రూమ్ కాల్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవడంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా పేర్కొన్న ఫోన్ నెంబర్ కాల్ చేస్తే కంట్రోల్ రూమ్ స్టాఫ్ సహకరిస్తారన్నారు. గ్రూప్–2 పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.

ఎస్‌టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షునికి సన్మానం

చింతకొమ్మదిన్నె: రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన కె.సురేష్ బాబుని మండలంలోని జె.కొత్తపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం గురువారం ఘనంగా సన్మానించింది. ఇటీవల పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరంలో జరిగిన రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర సంఘం ఎన్నికలలో కడప జిల్లా చింతకొమ్మదిన్నె మండలం, జె.కొత్త పల్లి లోని ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయునిగా పనిచేయుచున్న కె.సురేష్ బాబు జిల్లా అసోసియేట్ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైనారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధా నోపాధ్యాయులు పి.భాగ్య లక్ష్మి మాట్లాడుతూ సురేష్ బాబు గతంలో ఎస్‌టియు సంఘంలో పలు సేవలు అందించారని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యా యులు భాస్కర్, రామచంద్రారెడ్డి, నారాయణ రాజు, శంకర్ రెడ్డి, కృపావతి,విజయలక్ష్మి, హైమావతి పాల్గొన్నారు.

కెఎల్‌ఎం కళాశాలలో ట్విన్స్‌డే

ప్రజాశక్తి- కడప అర్బన్

కెఎల్‌ఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ట్విన్స్ డే కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. కవల పిల్లలను ఆహ్వానించి వారికి ప్రత్యేక పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. వారి అలవాట్లు, దిన చర్యలు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి.రత్నమ్మ అన్ని విభాగాధితిపతులు పాల్గొన్నారు.



ట్విన్స్‌డే కార్యక్రమంలో పాల్గొన్న కవలలు



మాట్లాడుతున్న ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ శ్రీనివాసులు

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - బద్వేలు

పట్టణంలోని భాకరాపేట చెరువును ఆక్రమించి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా దిమ్మెల ఫ్యాక్టరీ నడుపుతున్న యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, భూకబ్జాదారుల నుంచి చెరువులను కాపాడాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ కె.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సుందరయ్య భవనంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ పట్టణంలో విచ్చలవిడిగా భూకబ్జాదారులు చెరువులను, మోరీలను, వాగులను సైతం లెక్కచేయకుండా ఆక్రమించుకొని ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారని వాపోయారు. వారిపై రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపాల్టీ అధికారులు చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. ఐలమ్మ కాలనీ చెరువును ఆక్రమణకు గురికాకుండా చుట్టూ ఫెన్సింగ్ వేసి కాపాడాలని కోరారు. కబ్జాదారులు చెరువులు ఆక్రమించడం వల్ల నీటిని నిలువ చేసుకోవడానికి లేకుండా పోయిందన్నారు. వ్యవసాయానికి ఇబ్బందిగా మారిందని పేర్కొన్నారు. రౌండ్ టేబుల్ సమావేశంలో డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.కె. మస్తాన్, షరీఫ్, గంగనపల్లి, నాగార్జున, బద్వేల్ రూరల్ కార్యదర్శి బాల గురయ్యా, పట్టణ నాయకులు ఆంజనేయులు, ముస్తఫా, కెవిపిఎస్ నాయకులు రాయప్ప, మహిళా సంఘం నాయకురాలు మోక్షమ్మ ,బాలమ్మ, ఖైరున్నీ, ఆవాజ్ నాయకులు బాబయ్య, వడ్డెర సంఘం నాయకులు గంపా సుబ్బరాయుడు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులకు భయపడే ప్రసక్తే లేదు

ప్రజాశక్తి - కడప

మెగా డిఎస్‌సి కావాలని డిమాండ్ చేస్తూ గురువారం విజయవాడలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సెక్రటేరియట్ ముట్టడి కార్యక్రమానికి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల పిలుపు ఇచ్చారు. ఈ మేరకు కడప జిల్లా నుంచి ముట్టడి కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లిన కాంగ్రెస్ పార్టీ నాయకులను పోలీసులు అడ్డుకొని అరెస్టు చేశారు. పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో పార్టీ నాయకులు, పోలీసుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. అక్రమ మహారాష్ట్రలకు నిర్బంధాలకు భయపడే ప్రసక్తి లేదని కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు చెప్పలి పుల్లయ్య, కాంగ్రెస్ పార్టీ హ్యూమన్ రైట్స్ కడప జిల్లా అధ్యక్షులు పాలగిరి శివ హెచ్చరించారు. అరెస్టు అయిన వారిలో కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఉపాధ్యక్షుడు గౌస్, జోసెప్,స్టేట్ జనరల్ సెక్రెటరీలు ఎం. శ్రీనివాసరెడ్డి, చాన్‌బాషా జిల్లా అధ్యక్షుడు అరుణ్‌కుమార్, హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షులు పాలగిరి శివ ఉన్నారు.



పూడికతీత పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ యనమల సుధాకర్

రైతుల ఆనందమే ముఖ్యం

ప్రజాశక్తి- పోరుమామిళ్ల

రైతుల కళ్ళల్లో ఆనందమే తనకు ముఖ్యమని, వారి కోసం ఎంత ఖర్చుకైనా వెనుకాడేది లేదని మేజర్ పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ పేర్కొన్నారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద చెరువు నుండి ప్రధాన కాలువ పూర్తిగా పూడిపోవడంతో రైతులు తనను ఆశ్రయించారని తెలిపారు. పంటలు ఎండిపోతున్న తరుణంలో సం బంధిత అధికారులు, ప్రస్తుత అధికార పార్టీ నాయకులు స్పందిం చకపోవడం చాలా బాధాకరమని వాపోయారు. సమస్య తన దృష్టికి వచ్చిన వెంటనే స్పం దించి కాలువకు మరమ్మతులు చేయించామన్నారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా తాను ముందు ఉంటానన్నారు. కాలువ పూడిక తీస్తే రంగస ముద్రం, రెడ్డి కొట్టాల చెరువులకు నీళ్లు రావడం వల్ల ఎనిమిది వందల ఎకరాలకు ఉపయో గపడుతుందన్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తీరు స్తామన్నారు. కాలువ మరమ్మతులు చేయడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు.

నకిలీ విత్తనాలతో నష్టపోతున్న రైతులు

ప్రజాశక్తి - మైదుకూరు

ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఇష్టానుసారంగా జిల్లాలో నడుస్తున్న నర్సరీలతో రైతులు నష్టపోతున్నారని రైతు సేవా సమితి సభ్యులు శ్రీనివాసులు ఆరోపించారు. రైతులు నర్సరీలలో తీసుకొస్తున్న నకిలీ విత్తన నారు పంట కాపు దశకు వచ్చే సమయానికి పూర్తిస్థాయిలో పంట కాయకపోవడం.. లేకపోతే మొక్క నశించి పోవడం జరుగుతోందని తెలిపారు. పెట్టుబడి పెట్టి పంట చేతికి వచ్చే సమయంలో రైతు నష్టపోతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. నర్సరీ దగ్గర నారు కొనుగోలు చేసే సమయంలో రైతుకు ఎలాంటి రసీదు ఇవ్వక పోవడం వల్ల నష్టపోయిన సందర్భాల్లో యజమానులను ప్రశ్నించలేకపోతున్నారని వాపోయారు. ప్రభుత్వం వెంటనే అనధికారికంగా నడుస్తున్న నర్సరీలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మైదుకూరు పట్టణ పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో బంతిపూల పంటతో నష్టపోయిన రైతు భూమిరెడ్డి వెంకట శివ పొలాన్ని రైతు సేవా సమితి సభ్యులు, మైదుకూరు పట్టణ నాయకులు శ్రీనివాసులు, రైతులు పరిశీలించారు.


బంతిపూల పంటతో నష్టపోయిన రైతు భూమిరెడ్డి వెంకటశివ

మీడియాపై దాడులు అప్రజాస్వామికం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, కర్నూలు ఈనాడు ప్రాంతీయ కార్యాలయంపై వైసిపి కార్యకర్తలు దాడులు చేయడం అప్రజాస్వామ్యమని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. గురువారం ప్రొద్దుటూరులో జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్ రాజ్, జిల్లా కమిటీ సభ్యులు వెంకటేష్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసిపి అరాచక పాలనలో పాత్రికేయులపై దాడులు నిత్యకృత్యమయ్యాయన్నారు.

వైసిపి పాలనలో దాడులు అధికం : భూపేష్‌రెడ్డి

జమ్మలమడుగు రూరల్ : పత్రికలపై దాడి అప్రజాస్వామిక చర్య అని జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో రోజురోజుకూ ప్రజాస్వామ్యం దిగజారి పోతోందన్నారు. వైసిపి అరాచక పాలనలో పాత్రికేయులపై దాడులు అధికమయ్యాయని, వీటిని అరికట్టేందుకు ప్రజాస్వామ్య విధమైన ప్రభుత్వం అధికారంలో ఉండాలన్నారు. దాడులకు పాల్పడిన వారిపై 307 కింద కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు.

గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - చాపాడు

జిల్లాలో నూతనంగా నాలుగు వరుసల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. అందులో భాగంగా చాపాడు మండల పరిధిలో పనులు ప్రారంభమయ్యాయి. గత ఏడాది జిపిఎస్ విధానంలో సర్వే రాళ్లు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. మండల పరిధిలో భూసేకరణలో భాగంగా గుర్తులు ఏర్పాటు చేసి రైతులకు నష్టపరిహారం చెల్లించారు. కొంతమంది రైతులకు నష్ట పరిహారం అందలేదు. అలాంటి రైతుల వివరాలు సేకరించి పరిహారం అందేలా అధి కారులు చర్యలు తీసుకుంటున్నారు. అనంతపురం, బూడిదపాడు, కుచ్చుపాప, అల్లాడుపల్లె, సోమాపురం, పిచ్చపాడు రెవెన్యూ గ్రామాల పరిధిలో 350 ఎకరాల వరకు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం కోసం వినియోగించనున్నట్లు తెలుస్తోంది. ఆంధ్ర, కర్ణాటక సరిహద్దులోని అనంతపురం జిల్లా కోడికొండ వద్ద హైదరాబాద్-బెంగళూరు 44వ జాతీయ రహదారి నుంచి చెన్నై, కోల్‌కత్తా హైవేపైకి నూతనంగా నాలుగు వరుసల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం చేపట్టేందుకు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా చర్యలు తీసుకుంటోంది. పాత రోడ్డు కాకుండా పూర్తిగా నూతన నాలుగు వరుసల రోడ్డు నిర్మించేందుకు చర్యలు చేపడుతోంది. అందుకోసం జిల్లాలో 125 కిలో మీటర్లు మేర రోడ్డు నిర్మించేందుకు 1100 హెక్టార్లు భూములను వినియోగించనున్నది. 60 మీటర్ల వెడల్పుతో రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ రోడ్డు పూర్తయితే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు మన జిల్లా నుండి సులభంగా ప్రయాణించేందుకు అవకాశం ఉంటుంది. జిల్లాలో పులివెందుల, కమలాపురం, మైదుకూరు, బద్వేలు నియోజకవర్గాలు గుండా నిర్మించేందుకు డిపి ఆర్ సిద్ధం చేశారు. ప్రస్తుతం నేషనల్ హైవే అథారిటీ సిబ్బంది మండల పరిధిలో రోడ్డు నిర్మించే ప్రాంతాల్లో వంతెనల నిర్మాణానికి పిల్లర్లు వేసి సర్వే కూడా పూర్తి చే శారు. ప్రస్తుతం జెసిబి యంత్రాల ద్వారా పంట పొలాలను చదును చేస్తున్నారు. ఈ వేసవిలో రోడ్డు పనులు వేగవంతం చేస్తారని నిర్వాహకులు పేర్కొంటున్నారు. యర్ర గుంట్ల నుంచి పోరుమామిళ్ల వరకు మెగా సంస్థ రోడ్డు పనులు చేపడుతున్నట్లు తెలుస్తోంది.


రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా పంట పొలాలను చదును చేస్తున్న యంత్రాలు

వైభవంగా శ్రీవెంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండల కేంద్రమైన సింహాద్రిపురంలో మహాగణపతి, శ్రీదేవి భూదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన వైభవంగా ముగిసింది. గురువారం అర్చకులు దేవరకొండ బాలాజీ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. మహిళల కోలాటం ఎంతగానో అలరించింది. పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.


ప్రత్యేక అలంకరణలో శ్రీవెంకటేశ్వరస్వామి

మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీ 19వ వార్డు శ్రీ నగరం గ్రామంలో గురువారం వైభవంగా పం చముఖ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు, హోమాలు చేప ట్టారు. కార్యక్ర మానికి విచ్చేసిన టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధా కర్ యాదవ్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలి కారు. మైదుకూరు పట్టణ టిడిపి అధ్యక్షులు దాసరి బాబు, బిఎస్ శ్రీనివాసులు, బండి రెడ్డియ్య, బిఎస్ శ్రీనివాసులు, గోసెట్టి వెంకటరమణ, కామనూరు శ్రీనివాసులు, అమీర్‌బాషా, హరి, తిరుమలేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.


ఆంజనేయస్వామి ఆలయంలో పుట్టా

ఘనంగా చౌడేశ్వరిదేవి వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణ పరిధిలోని చౌడేశ్వరిదేవి 36వ వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారు ప్రజలకు దర్శన మిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణ ప్రజలే కాకుండా చుట్టుపక్క ప్రాంతాల నుండి భక్తులు అమ్మవారి దర్శనానికి పోటెత్తారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. అన్నప్రసాదాలు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎర్రగుంట్ల మండల టిడిపి ఇన్‌ఛార్జి జయరామిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, జడ్పిటిసి బాలయ్య అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


మాట్లాడుతున్న చాంద్‌బాషా, రాంభూపాల్‌రెడ్డి

కౌన్సిలర్ పదవికి రాజీనామా చేయాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

19వ వార్డు కౌన్సిలర్ పార్టీ సభ్యతానికి కాదు.. పార్టీ ద్వారా లభించిన కౌన్సిలర్ పదవికి రాజీనామా చేయాలని ఆ వార్డు ఇన్‌ఛార్జి చాంద్‌బాషా, టౌన్ బ్యాంక్ డైరెక్టర్ రాంభూపాల్‌రెడ్డి సూచించారు. గురువారం సాయంత్రం 19వ వార్డు వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. కౌన్సిల్ ఎన్నికలకు 20రోజుల ముందు మునీర్ సౌదీ నుండి ఇక్కడకు రాగా, అప్పటికప్పుడు ఆలోచించి మునీర్‌ను కౌన్సిలర్‌గా నిలబెట్టి పట్టుపట్టి గెలిపించుకున్నామన్నారు. అందుకు అయిన ఖర్చు అంతా తామే భరించామన్నారు. ఇక్కడ స్థానికంగా లేడని వీధివాసులు వ్యతిరేకించినప్పటికీ అన్నిటికీ సర్దిచెప్పి తాము మునీర్‌ను కౌన్సిలర్‌గా గెలిపించుకున్నామన్నారు. జగనన్న కాలనీ పథకం మెదలైన రెండు నెలలకు తాను ఇళ్లు నిర్మించి ఇస్తానని 78మంది లబ్ధిదారుల్లో ఒక్కొక్కరి వద్దనుండి రూ.35వేల చొప్పున వసూలు చేశారని ఆరోపించారు. ఆ లబ్ధిదారులు తమపై వత్తిడితేగా మునీర్‌ను అడిగామని తెలిపారు. దీన్ని మనసులో పెట్టుకొని సాకులు చెబుతూ తప్పించుకొని తిరుగుతున్నాడన్నారు. వార్డు లబ్ధిదారులు వత్తిడి తెస్తారని భయపడి వార్డులో కూడా కనిపించడంలేదన్నారు. వెంటనే కౌన్సిలర్ పదవికి రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు.

ఆశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - ఖాజీపేట

మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి, ఆయన సతీమణి సుభద్రమ్మ దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా గురువారం వృద్ధులకు అన్నదానం చేశారు. మండలం పరిధిలోని పూనీత లారెన్స్ వృద్ధాశ్రమంలో తిప్పిరెడ్డి పల్లె గ్రామానికి చెందిన డిఎల్ యువసేన సభ్యుడు కోటయ్యగారి గురుమోహన్, నేస్తం సేవా సంస్థ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. డిఎల్ యువసేన సభ్యుడు నొస్సమ్ సురేష్, నేస్తం సేవా సంస్థ సభ్యుడు కోగటం కొండారెడ్డి, చెన్నకేశవరెడ్డి, గోగుల నరసింహ పాల్గొన్నారు.


అన్నం వడ్డిస్తున్న గురుమోహన్, నేస్తం సేవా సంస్థ ప్రతినిధులు

పేదల పక్షపాతి జగన్ : ఎమ్మెల్సీ రమేష్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

సమాజం నుండి పేదరికాన్ని దూరం చేయాలని పేదల పక్షపాతిగా ముఖ్యమంత్రి జగన్ వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్ తెలిపారు. స్థానికంగా ఉన్న తన కార్యాలయంలో ఆయన గురువారం సిఎం సహాయనిధి నుండి రూ.9లక్షల చెక్కులను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా రమేష్‌యాదవ్ మాట్లాడుతూ స్థానిక దేవాంగపేటకు చెందిన పోసా చంద్రశేఖర్ అనారోగ్యంతో బాధపడుతూ కర్నూలు ఒమేగా ఆసుపత్రిలో బెంగళూరుకు చెందిన సైంట్‌జాన్స్ మెడికల్ కాలేజ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారన్నారు. ఆయన వైద్యానికి అయిన ఖర్చు నిమిత్తం రూ.3.50లక్షలు మంజూరు చేశారన్నారు. జిల్లాలోని పలు గ్రామాలకు చెందిన మరో ముగ్గురికి తమ వైద్యానికి అయిన ఖర్చుల నిమిత్తం రూ.5.50లక్షల చెక్కులను అందించామన్నారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో మద్దతు పలకాలని రమేష్‌యాదవ్ కోరారు.

దొంగ పట్టాలు సృష్టిస్తున్న వారిని అరెస్టు చేయాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

అమృత్‌నగర్ స్థలాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, పేదలకు ఇస్తున్న స్థలాలు అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం డిమాండ్ చేసింది. సిపిఎం ఆధ్వర్యంలో లబ్ధిదారులు చేపట్టిన రిలే దీక్షలు శనివారానికి 29వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను ఉద్దేశించి సిపిఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ 2008లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా స్థలాలు ఇచ్చారని, అక్కడ మౌలిక వసతులు కల్పిం చడంలో అధికారులు, ప్రభుత్వాలు, రాజకీయ నాయకులు ఘోరంగా విఫల మయ్యారన్నారు. వేలాది రూపాయలు ఖర్చుపెట్టి బేస్ మట్టాలు వేసు కున్నారు. కొందరు ఇళ్లను నిర్మించుకున్నారు. అవి కూడా శిథిలావస్థకు చేరు కున్నాయి. పెట్టిన ఖర్చు వృథాగా అయిపోయిందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. అమృత్‌నగర్‌లో కొంతమంది తహశీల్దార్ రాజముద్ర కలిగిన సీలు తయారు చేసుకొని దొంగ పట్టాలు తయారు చేస్తూ టీంలుగా ఏర్పడి పేదవారిని బెదిరిస్తూ కోట్ల రూపాయలు స్థలాలు అమ్ముకుంటూ గడి స్తున్నారన్నారు. అలాంటి వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పం పాలన్నారు. వీరిపై అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తూ సహక రిస్తున్నారన్నారు. ఆందోళనలో లత, రమీజా, హరి, నరసింహ, మధు, వెంక టేష్, హసీనా, పుష్పలత, మల్లికా, భాను, కిరణ్ బాబు, ఐద్వా జిల్లా కార్యదర్శి ముంతాజ్ బేగం, రాములమ్మ, హుస్సేన్‌బాషా, లబ్ధిదారులు పాల్గొన్నారు.


ధర్నా నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు, లబ్ధిదారులు

బ్రిటిష్ దుష్ట పాలనను ఎదిరించిన 'ఉయ్యాలవాడ'


నివాళులర్పిస్తున్న ఉయ్యాలవాడ అభిమానులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

1857లో మొదటి భారత స్వాతంత్ర్య యుద్ధానికి పదేళ్ల ముందే బ్రిటీష్ దుష్ట పాలనపై ఎదిరించి తిరుగుబాటు చేసిన తెలుగువీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని రేనాటి సూర్యచంద్రుల సేవాసంఘం అధ్యక్షుడు డాక్టర్ వై.వి.స్వరూప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఉయ్యాలవాడ వర్ధంతి సందర్భంగా గురువారం సంఘం ఆధ్వర్యంలో స్థానిక కొర్రపాడురోడ్డులోని నరసింహారెడ్డి కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశం కోసం వీరమరణం పొందిన మహాయోధులు, భావితరాలకు స్ఫూర్తిదాయకులు అన్నారు. సృష్టి ఉన్నంత వరకు గుర్తుంచుకోదగిన గొప్పదార్శనికులు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, కోటా ఓబులరెడ్డి, బూతూరు వెంకటరామిరెడ్డి, కొండారెడ్డి, పద్మావీరన్న, పాలగిరి కేశవరెడ్డి, రుక్మానందరెడ్డి, రామాంజనేయరెడ్డి, నరసింహారెడ్డి, అంకాల్ కొండయ్య, గురుమోహన్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : స్వాతంత్ర సమరయోధులు తెలుగు తొలి విప్లవకారుడు, రేనాటి సూర్యుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి బ్రిటిష్ వారిని ఎదిరించి వారికి ముచ్చెమటలు పట్టించిన గొప్పవ్యక్తి అని ఎపి రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షులు నారుపల్లె జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని వివేకానంద క్లాత్ మార్కెట్ ఎదురుగా ఉన్న స్వాతంత్ర సమరయోధులు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు ఎపి రెడ్డి సంఘం అధ్యక్షుడు గజ్జల పెద్దవేమారెడ్డి, ప్రొద్దుటూరు మండల ఉప మండలాధ్యక్షులు ఆసం దస్తగిరిరెడ్డి, రెడ్డి సంఘం నాయకులు బొమ్ము లక్ష్మీ పుల్లారెడ్డి, కెసి ఓబులరెడ్డి, కోట ఓబులరెడ్డి, పాలగిరి కేశవరెడ్డి, వంగల వెంకటేశ్వరరెడ్డి, బద్రి లక్ష్మీ రంగారెడ్డి, బంక లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

పులివెందుల టౌన్ : ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ముద్దనూరు రోడ్డులోని విభిన్నప్రతిభావంతుల కమ్యూనిటీ భవనంలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో రెడ్డి కమ్యూనిటీ నాయకులు ఉయ్యాలవాడ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పులివెందులలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహాన్ని త్వరలో ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. పట్టణంలో రెడ్డి కమ్యూనిటీ ఫంక్షన్ హాల్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ పులివెందుల నియోజకవర్గ నాయకులు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, చప్పిడి కృష్ణారెడ్డి, ముత్తుకూరు ప్రదీప్‌రెడ్డి, కౌన్సిలర్లు లక్ష్మీ ప్రసన్న, సికె భార్గవి , ఆర్‌సిడిఎస్ కార్యవర్గ సభ్యులు కామసముద్రం చంద్రఓబులరెడ్డి, సిద్ధారెడ్డి, ఓబులరెడ్డి, శివశంకరరెడ్డి, బాబురెడ్డి పాల్గొన్నారు.

నియంతలా వ్యవహరిస్తున్న జగన్ : కాంగ్రెస్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రజాస్వామ్య పుణ్యమా అని సిఎంగా ఎంపికైన జగన్ ఆంధ్రరాష్ట్రాన్ని నియంతలా పాలిస్తున్నాడని కాంగ్రెస్‌పార్టీ ఇన్‌ఛార్జి నజీర్, నియోజకవర్గ కన్వీనర్ సుబ్రహ్మణ్య శర్మ తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఛలో సెక్రటేరియేట్ కార్యక్రమాన్ని అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. దగా డిఎస్సీ వద్దు మెగా డిఎస్సీ విడుదల చేయాలని విద్యార్థుల భవిష్యత్తు కోసం తాము శాంతియుతంగా పోరాడుతుంటే ఎక్కడికక్కడ నిర్బంధించడం అప్రజాస్వామికమన్నారు. పిసిసి అధ్యక్షురాలు షర్మిలతోపాటు రాష్ట్ర నాయకులను అరెస్టు చేయడం బాధాకరమన్నారు. షర్మిల పార్టీలో చేరినప్పటి నుండి భయంతో వణికిపోతున్నారన్నారు. ప్రజాస్వామ్య రాజ్యంలో ప్రతిపక్షాల పాత్ర గొప్పదన్నారు. అలాంటి ప్రతిపక్షాలను అణగదొక్కాలనుకోవడం, పోలీసులను అడ్డుపెట్టుకొని పాలన సాగించాలనుకోవడం అవివేకమన్నారు. నిరుద్యోలులైన విద్యాధికులను జగన్‌రెడ్డి మోసం చేసినందుకు సిగ్గుతో తల దించుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సైమన్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

'జగన్ పాలనలో పేదలు బతకలేకున్నారు'


టిడిపిలో చేరినవారితో బిటెక్ రవి, నాయకులు

ప్రజాశక్తి - వేంపల్లె : స్థానిక పుల్లయ్యతోట వీధిలో వైసిపికి చెందిన 20 కుటుంబాలు గురువారం టిడిపిలో చేరాయి. బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఎద్దుల సురేష్, వెంకటేష్, హుసేన్ పీరా, ప్రసాద్, జగన్, నరేంద్ర, కిరణ్, ఇస్మాయిల్, పాములూరు బాషా, పాములూరు వలి, షేక్ దాదాపీర్ చేరారు. వీరికి పులివెందుల ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ టిడిపికి వస్తున్న ఆదరణ చూస్తుంటే వైనాట్ పులివెందుల అనేలా కనబడుతోందన్నారు. జగన్‌రెడ్డి పాలనను చూసిన నిరుపేదలు, సామాన్యులు ప్రజా జీవితం గడపలేకపోతున్నట్లు చెప్పారు. టిడిపి, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోను చూసి ప్రజలు, కార్యకర్తలు పార్టీ పట్ల ఆకర్షితులవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి, మండల కన్వీనర్ రామమునిరెడ్డి, నిమ్మకాయల మహమ్మద్ దర్బార్, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, మైనార్టీ మండల కన్వీనర్ తెలంగాణ వలి, మహమ్మద్, డక్కా రమేష్, వేమకుమార్, రెడ్డి కిషోర్, నాగసుబ్బయ్య, మడక శ్రీనివాసులు, గోగుల మల్లికార్జున, అల్లాబకష్, యుగంధర్, బాల కృష్ణారెడ్డి, వీరబద్ర, రామాంజనేయురెడ్డి పాల్గొన్నారు.

పేదల సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

పేదలకు సంక్షేమ పథకాలు సకాలంలో అందించాలంటే అది చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని ప్రొద్దుటూరు టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక రూరల్ పరిధిలోని సోములవారిపల్లె పంచాయతీ పెన్నానగర్‌లో గురువారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి మినీ మేనిఫెస్టో ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నందం లక్ష్మీదేవి, బాలు, గంగాధర్, పూల కాజా, మాజీ కౌన్సిలర్ సీతారామిరెడ్డి, భరత్‌రెడ్డి, బెజవాడ సుబ్రహ్మణం, నియోజకవర్గ అబ్జర్వర్ ప్రసాద్, పెన్నానగర్ మజీద్, రూరల్ మండలం ఉపాధ్యక్షుడు షరీఫ్ కవి, రూలర్ మండల కన్వీనర్ కోడెల బాబుల్‌రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ బండి విజయభాస్కర్‌రెడ్డి, రాజుపాలెం మండల కన్వీనర్ ధనిరెడ్డి విశ్వనాథరెడ్డి, రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి శ్రీనివాస్ యాదవ్, టిడిపి నాయకులు, కార్యకర్తలు, నందమూరి అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


మినీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేస్తున్న ప్రవీణ్


వి.రాజుపాలెం పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఇఆర్ఒ చంద్రమోహన్

పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలి

ప్రజాశక్తి - చాపాడు

పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అన్ని వసతులు కల్పించాలని జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఇఆర్ఒ చంద్రమోహన్ ఆదేశించారు. మండల పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున పోలింగ్ కేంద్రాల్లో వసతులు, ఏర్పాట్లపై ఆయన పర్యవేక్షించారు. నక్కలదిన్నె, వి.రాజుపాలెం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో తహశీల్దార్ వై.భూషణం, రీ సర్వే డిటి పిప్రవీణ్, మండల సర్వేయర్ సాయిలత, విఆర్ఒలు పాల్గొన్నారు.


పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ వ్యవస్థాపకులు

మనోధైర్యమే విజయానికి బాటలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఆత్మవిశ్వాసం, మనోధైర్యమే విజయానికి బాటలు వేస్తాయని వివేకానంద ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి తెలిపారు. పట్టణంలోని ఎ.పి. గురుకుల పాఠశాల, గూడెం చెరువు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, పెద్ద పసుపుల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో గురువారం పదో తరగతి చదువుతున్న 133 మంది విద్యార్థులకు ఆ సంస్థ ఆధ్వర్యంలో పరీక్షా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలన్నారు. నిజ జీవితంలో రాణించాలంటే మార్కులే ప్రామాణికం కాదని, ప్రతి విద్యార్థి లక్ష్యసాధన కోసం ప్రయత్నం చేయాలన్నారు. ఉన్నతమైన విలువలను అలవర్చుకోవాలన్నారు. పరీక్షల పట్ల ఎలాంటి ఆందోళన చెంద వద్దని ఆయన సూచించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు తిమ్మక్కగారి వెంకట సురేష్, కేతన శ్రీనాథ్, పిఇటి గురున్నాథ్, ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.

రేపు మినీ జాబ్ మేళా

ప్రజాశక్తి- రాయచోటి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శనివారం రాయచోటిలోని, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మినీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు నైపుణ్య అభివృద్ధి అధికారి బి.హరికృష్ణ, కళాశాల ప్రిన్సిపల్ శివశంకర్ గురువారం ఒక సంయుక్త ప్రకటన పేర్కొన్నారు. జాబ్ మేళాలో ఆటోలివ్ ఇన్‌ఫ్లేటర్, ఇండి గ్రిడ్ కంపెనీల ప్రతి నిధులు పాల్గొంటారని తెలిపారు. ఏదైనా డిగ్రీ, డిప్లొమా పాస్ అయిన 18 నుంచి 24 ఏళ్ల మధ్య వయస్సు కల్గిన స్త్రీ, పురుష అభ్యర్థులు హాజరు కావచ్చని పేర్కొన్నారు. ఎంపికైన వారికి రూ.18 వేల నుంచి రూ.25 వేల వరకు వేతనం ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ విద్యార్హత పత్రాలు, ఆధార్ కార్డు, బయో డేటాలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని పేర్కొన్నారు. అవకాశాన్ని అన్నమయ్య జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగ పరచుకోవాలని తెలియజేశారు. మరిన్ని వివరాలకు 9550104260, 8897776368లలో సంప్రదించాలని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

IN THE COURT OF THE HONBLE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT KADAPA
E.P.No.44/2021
O.S.No.247/2018

M.Suraya Narayana Reddy, Son of M. Narayana Reddy, aged about 42 years, Hindu, residing at Cheemalapenta Village, Pendlimarry Mandal, YSR Kadapa District.
...Petitioner/Decree Holder
Verses
Manneti Surya Narayana Reddy, Son of M. Chinna Narayana Reddy, aged about of 54 years, Hindu, Business, residing at D.No.4/535, Revenue Complex, Opp: Anjaneyaswamy Temple, Old Bus Stand, Kadapa City, Now residing at Chennamrajupalli Village, Pendlimarry Mandal, YSR Kadapa District.
...Respondent/Judgment Debtor

NOTICE UNDER ORDER 21 RULE 64 OF CPC

Whereas the above Petitioner/Decree Holder filed an Execution Petition before the above said Hon'ble court against you for sale of below mentioned schedule property and the said case stands posted on 27-02-2024 for your appearance. Therefore take this notice and appear before the above said Hon'ble court at 10:00 AM either personally or through advocate without fail. If you fail to attend before the above said Hon'ble court, ex-partee orders will be passed against you for your absence.

SCHEDULE PROPERTY

Kadapa District, Kadapa Sub district, Pendlimarry Mandal, Chennamrajupalli Village fields of land in the following survey numbers
1. SY No.213/2 an extent of Ac.1.35 cents,
2. SY No.210/2 an extent of Ac.1.21 cents.
3. SY No.137 an extent of Ac.2.41 cents.
4. SY No.212/2 an extent of Ac.1.16 cents
5. SY No.212/2 an extent of Ac.1.26 cents
6. SY No.134 an extent of Ac.2.63 cents
7. SY No.135 an extent of Ac.0.25 cents
8. SY No.136 an extent of Ac.0.50 cents
9. SY No.214/1 an extent of Ac.1.18 cents
10. SY No.213/1 an extent of Ac.1.26 cents
11. SY No.214/2 an extent of Ac.1.70 cents
12. SY No.215/2 an extent of Ac.2.06 cents
13. SY No.215/1 an extent of Ac.0.97cents

Total an extent of Ac.17.94 cents
Approximately Value of property is at Rs.8,00,000/- (Rupees Eight lakhs only)

//By Order of the Court//
VARRA RAJA GOPAL REDDY, M.A., B.L.
Advocate for the petitioner/Decree Holder, KADAPA, Cell: 9441155365.

IN THE COURT OF THE HONBLE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT KADAPA
E.P.No.45/2021
O.S.No.249/2018

Mandli Chennamma, wife of M. Pedda Narayana Reddy, aged about 62 years, Hindu, residing at Cheemalapenta Village, Pendlimarry Mandal, YSR Kadapa District.
...Petitioner/Decree Holder
Verses
Manneti Surya Narayana Reddy, Son of M. Chinna Narayana Reddy, aged about of 54 years, Hindu, Business, residing at D.No.4/535, Revenue Complex, Opp: Anjaneyaswamy Temple, Old Bus Stand, Kadapa City, Now residing at Chennamrajupalli Village, Pendlimarry Mandal, YSR Kadapa District.
...Respondent/Judgment Debtor

NOTICE UNDER ORDER 21 RULE 64 OF CPC

Whereas the above Petitioner/Decree Holder filed an Execution Petition before the above said Hon'ble court against you for sale of below mentioned schedule property and the said case stands posted on 27-02-2024 for your appearance. Therefore take this notice and appear before the above said Hon'ble court at 10:00 AM either personally or through advocate without fail. If you fail to attend before the above said Hon'ble court, ex-partee orders will be passed against you for your absence.

SCHEDULE PROPERTY

Kadapa District, Kadapa Sub district, Pendlimarry Mandal, Chennamrajupalli Village fields of land in the following survey numbers
1. SY No.213/2 an extent of Ac.1.35 cents
2. SY No.210/2 an extent of Ac.1.21 cents
3. SY No.137 an extent of Ac.2.41 cents
4. SY No.212/2 an extent of Ac.1.16 cents
5. SY No.212/2 an extent of Ac.1.26 cents
6. SY No.134 an extent of Ac.2.63 cents
7. SY No.135 an extent of Ac.0.25 cents
8. SY No.136 an extent of Ac.0.50 cents
9. SY No.214/1 an extent of Ac.1.18 cents
10. SY No.213/1 an extent of Ac.1.26 cents
11. SY No.214/2 an extent of Ac.1.70 cents
12. SY No.215/2 an extent of Ac.2.06 cents
13. SY No.215/1 an extent of Ac.0.97cents

Total an extent of Ac.17.94 cents
Approximately Value of property is at Rs.8,00,000/-(Rupees Eight lakhs only)

//By Order of the Court//
VARRA RAJA GOPAL REDDY, M.A., B.L.
Advocate for the petitioner/Decree Holder, KADAPA, Cell: 9441155365.